క్లుప్తంగా

పనులు ప్రారంభం



పెద్దమ్మ ఆలయం స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయం స్లాబ్ పనులకు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆలయం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం, ఐకమత్యం పెరుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని చెప్పారు. గ్రామస్తులకు తనవంత సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు శాఖయ్య, గ్రామ సంఘం అధ్యక్షుడు మల్లేశం, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్, మాజీ సర్పంచ్ శివాంజనేయులు, నాయకులు పురుషోత్తం, వెంకటేశం, లక్ష్మణ్, పాండు, కిషన్, మోతిలాల్, చంద్రం, బాలింగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న హరికృష్ణశర్మ

నర్సాపూర్: పట్టణానికి చెందిన వేద పండితుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గౌడిచర్ల హరికృష్ణ శర్మ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ యూఎస్‌ఏ చైర్మన్ డాక్టర్ రమేష్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అకాడమిలు తనకు డాక్టరేట్ అవార్డును అందజేశాయని చెప్పారు. కాగా ఆధునిక జ్యోతిష్య శాస్త్ర విద్య, వేద గణితంలో తాను చేస్తున్న సేవలను గుర్తించి తనకు అవార్డు ఇచ్చారని, అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.

ఆలయంలో భక్తుల పూజలు



నల్లపోచమ్మకు పూజల చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నల్లపోచమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి, కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతోపాటు పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించాలి

మనోహరాబాద్(తూప్రాన్): రానున్న సర్పంచ్ ఎన్నికల్లో ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ఎస్టీల సంఘం ఉపాధ్యక్షుడు నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మండలంలో ఒకటి ఎస్టీలకు కేటాయించాలని అందులో భాగంగా మండలంలోని మేజర్ పంచాయతీ అయిన కాళ్లకల్‌ను సైతం ఎస్టీలకు కేటాయించాలని కోరారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితురాలికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 2001–02 పదవ తరగతి విద్యార్థుల్లో మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మల్లీశ్వరి భర్త ఇటీవల చనిపోయాడు. ఈ విషయం తెలిసిన పూర్వ విద్యార్థులు బాధితురాలిని పరామర్శించి రూ. 35వేలు నగదు అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్, మమత, సత్తయ్య, ప్రతాప్, నాగరాజు, విజయ్‌కుమార్, విఠల్, దశరథ్, వీరేశం, లక్ష్మీనారాయణ, దుర్గేష్, మానిక్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దారులు ఛిద్రం.. ప్రయాణం నరకం

• కేజ్‌వీల్స్‌తో ధ్వంసమవుతున్న రోడ్లు • పట్టించుకోని అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): అంతంతమాత్రంగా ఉన్న రహదారులు కేజ్‌వీల్స్‌తో ధ్వంసం అవుతున్నాయి. దీంతో వాహనదారులకు ప్రయాణం నరకంగా మారుతోంది. మండలంలో రూ.కోట్ల ప్రజాధనంతో రోడ్లు నిర్మిస్తుంటే.. నిబంధనలు పాటించని ట్రాక్టర్ యజమానుల వైఖరితో రహదారులు పాడవుతున్నాయి. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వలన పదికాలాల పాటు పదిలంగా ఉండే ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అనతి కాలంలోనే శిథిలావస్థకు చేరుతున్నాయి. బీటీ, మెటల్ నిర్మాణంలో ఒకపక్క నాసిరకం పనులతో కొద్ది రోజులకే రోడ్లు శిథిలమవుతుండడంతో దీనికి తోడు వాటిపైనే యథేశ్చగా ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో తిరుగుతుండడంతో మరింత అధ్వాన్నంగా తయారవుతున్నాయి.

చెరువులు, కుంటలతో పాటు బోర్ల ఆధారిత రైతులు మండలంలో ముమ్మరంగా వరి పొలాలు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఓ ప్రక్క పంట పొలాలు దున్నడంతో పాటు మరోపక్క విత్తనాల కొనుగోలుపై శ్రద్ధ వహిస్తున్నారు. యాంత్రీకరణ పెరిగిన నేపథ్యంలో వ్యవసాయ పొలాలను నాటుకు సిద్ధం చేయడానికి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధానరోడ్లపై నుంచే కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు వెళ్తున్నాయి. దీంతో రోడ్లు పాడవుతున్నాయి.



ధ్వంసమైన దామరంచ బీటీ రోడ్డు



కేజ్‌వీల్స్‌తో సీసీ రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్

ఇవీ నిబంధనలు..

ట్రాక్టర్ యజమాని పనిచేసే పొలానికి, ప్రాంతానికి కేజ్‌వీల్స్‌ను ట్రాలీలో కానీ మరే ఇతర వాహనంలో కానీ అక్కడకు తీసుకెళ్లాలి. ఆ తర్వాత ట్రాక్టర్‌కు కేజ్‌వీల్స్ బిగించి పనులు ముగిసిన అనంతరం మళ్లీ ట్రాక్టర్ నుంచి విడదీసి ఇతర వాహనంలో ఇంటికి తీసుకెళ్లాలి. కానీ క్షేత్రస్థాయిలో వీటికి విరుద్ధంగా జరుగుతోంది. ట్రాక్టర్‌కు ఇంటివద్దే కేజ్‌వీల్స్ బిగించుకొని ఇష్టారాజ్యంగా వెళ్తున్నారు. దీంతో బీటీ రోడ్లు పూర్తిగా లేచి చిన్న చిన్న గుంతలు పడి పెద్దగా మారి రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి, కేజ్‌వీల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కేసు నమోదు చేస్తాం



పొలం పనులు జరుగుతున్నప్పుడు ట్రాక్టర్ల వాడకం ఎక్కువగా ఉంటుంది. ట్రాక్టర్ నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ప్రతీ డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలి. అనుభవం ఉంటేనే ట్రాక్టర్ నడపాలి. ప్రమాదం జరిగితే సంబంధిత వాహన యజమానులే బాధ్యత వహించాలి. కేజ్‌వీల్స్‌తో రోడ్లపై తిరిగితే కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వాహన చట్టం కింద సంబంధిత ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాజు, ఎస్‌ఐ, వెల్దుర్తి

రైతులను విస్మరిస్తున్న కాంగ్రెస్

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని తిరుమలాపూర్‌లో ఓల్టేజ్ సమస్య నమస్కారం కోసం ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి, పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలపూర్‌కి వచ్చిన ఎమ్మెల్యేతో గ్రామ రైతులు కలిసి రుణమాఫీ, రైతుబంధు రావడంలేదని మొరపెట్టుకున్నారు. దీనికి ఆమె స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ప్రతీ రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. రైతుబంధును పెంచి యథావిధిగా రైతు ఖాతాలో వేస్తామని హామీ విస్మరించిందన్నారు. రైతులతో పాటు పెన్షన్ లబ్ధిదారులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చిన పాపన పోలేదన్నారు. కొన్ని రోజులుగా తిరుమలాపూర్ గ్రామస్తులు లో–ఓల్టేజ్ సమస్యతో బాధపడుతున్నారని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించి, పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భోగ శేఖర్, నాయకులు శ్రీశైలం రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

నర్సాపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆమె ఆదివారం క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నర్సాపూర్ మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పుష్ప, లింగాపూర్‌కు చెందిన భూలక్ష్మి, శివ్వంపేట మండలం గోమారంకు చెందిన లక్ష్మి, కౌడిపల్లి మండలం దేవులపల్లికి చెందిన క్రాంతికుమార్, చంద్రకళలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: నర్సాపూర్‌లోని వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఎంపీని కోరారు. ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో మురికి కాల్వలు, సీసీరోడ్లు నిర్మించేందుకు సుమారు రూ.50 లక్షలు కావాలని ప్రతిపాదనలు అందజేయగా, ఎంపి సానుకూలంగా స్పందించారన్నారు. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, పాటు ఆంజిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, శంకర్‌నాయక్, వెంకట్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీని శాలువాతో సన్మానించారు.



ఎంపీ రఘునందన్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు, కాలనీవాసులు

కూచారంలో యువకుల స్వచ్ఛభారత్



కూదారంలో యూత్ భవనం వద్ద శ్రమదానం నిర్వహిస్తున్న నేచర్ ఐకాన్ యూత్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 307వ వారంలో భాగంగా ఆదివారం స్వచ్ఛభారత్ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం, యూత్ భవనం వద్ద పిచ్చి మొక్కలను తొలగించి, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం వాటిని డంప్‌యార్డ్‌కు తరలించారు. అనంతరం ప్లాస్టిక్‌పై దుకాణదారులకు అవగాహన కల్పించారు.



శ్రమదానంతో సీసీ పనులు చేస్తున్న స్వాములు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో అయ్యప్పస్వాములు శ్రమదానం నిర్వహించారు. గ్రామంలో కొలువైన పురాతన కోదండరామస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో టాయిలెట్లు నిర్మిస్తున్నారు. మరికొందరు దాతల సాయంతో ఆలయం ఎదుట ఆదివారం అయ్యప్పస్వాములు శ్రమదానం చేసి సీసీ నిర్మించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు శ్రీనివాస్, రాజు, సత్యనారాయణ, రాము, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



కౌడిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లితో పాటు వెల్మకన్న, కొట్టాల, లింగంపల్లి గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకా ముప్పై శాతం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే చేయాల్సి ఉందన్నారు. దీంతో సర్వేను ముమ్మరం చేసేందుకు ఆదివారం సైతం విధులు నిర్వహించినట్లు చెప్పారు. సర్వే త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని లబ్ధిదారులు సహకరించాలని తెలిపారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ

శివ్వంపేట(నర్సాపూర్): డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దొంతి గ్రామంలోని 8వ వార్డులో నిర్మించిన అండర్‌గ్రౌండ్ మురికి కాల్వ మ్యాన్‌హోల్లో పైప్‌లైన్ పగిలిపోవడంతో మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో పారిశుద్ధ్య లోపంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దుర్వాసనతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మురికికాల్వ నిర్మాణం అనంతరం సీసీ రోడ్డు నిర్మిస్తామని చెప్పినా.. అధికారులు పనులు చేపట్టాలేదని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి శంకర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. నిధుల కొరత మూలంగా సీసీ నిర్మాణం చేపట్టకపోవడంతో సమస్య తలెత్తిందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



అండర్‌గ్రౌండ్ మురికి కాల్వ దుస్థితి

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఎల్లారెడ్డి రూరల్: చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డికి చెందిన మహ్మద్ అబేద్ 19న ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా.. ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. నగదు, ఏటీఎం కార్డు ఎత్తుకెళ్లారు. ఏటీఎం కార్డుతో డబ్బులను విత్ డ్రా చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మహేశ్, నాగిరెడ్డిపేట మండలం లొంకపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్యగా గుర్తించి అరెస్ట్ చేశారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటే లక్ష్యం

• సీఐటీయూ నేత వెంకటచారి

గజ్వేల్‌రూరల్: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసే వరకు తమ పోరాటం ఆగదని సీఐటీయూ నాయకుడు వెంకటచారి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ప్రమాదాల బారిన పడిన హమాలీ కార్మికులను ఆదుకొనేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. వారికి గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ లాంటి సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ గోదాములలో పనిచేసే హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు కార్మికులకు ఇళ్లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నిప్పుపెట్టిన దుండగులను శిక్షించాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ వాహనాలకు నిప్పు పెట్టి దహనం చేసిన దుండగులను వెంటనే గుర్తించి శిక్షించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల గోల్కొండ మోడల్ స్కూల్‌కు చెందిన రెండు వాహనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం స్కూల్ వాహనాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ రవిని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు పంజాల శ్రీనివాస్‌గౌడ్, మల్లన్న బండ ఆలయ కమిటీ చైర్మన్ లింగాల వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కొమ్మాట బాలకృష్ణ, కంచం యాదగిరి తదితరులు ఉన్నారు.

దుర్భర పరిస్థితుల్లో చేనేత కుటుంబాలు

దుబ్బాక: ఆదరణ కరువవ్వడంతో చేనేత కార్మికుల కుటుంబాలు దుర్భర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యవేదిక దుబ్బాక మండల అధ్యక్షుడిగా గోనె మధుసూదన్‌కు ఆదివారం ఆయన నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గాజుల తిరుపతి తో పాటు తదితరులు ఉన్నారు.

రాయితీపై మొక్కజొన్న విత్తనాలు

జిల్లా వ్యవసాయ అధికారి రాధిక

మర్కుక్(గజ్వేల్): మండలంలోని గణేశ్‌పల్లిలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, ములుగు సహాయ వ్యవసాయ సంచాలకుడు అనిల్‌కుమార్ ఆదివారం మొక్కజొన్న విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ మండలంలో పత్తిని తీసివేసి మొక్కజొన్న సాగుచేసే వారికి జాతీయ ఆహార భద్రత మిషన్–మొక్కజొన్న పథకంలో భాగంగా రూ.1375లు విలువచేసే 5కిలోల బయోసీడ్ 9544 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను రూ.500 సబ్సిడీ పోగా రూ.875కే అందజేస్తున్నారని చెప్పారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని హనుమాన్ ఫర్టిలైజర్స్‌లో పొందవచ్చని చెప్పారు. మండలానికి 200 ప్యాకెట్లు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి వసంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణుయాదవ్, రజనీకాంత్‌గౌడ్, మీనాక్షి, రైతులు పాల్గొన్నారు.



విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న రాధిక

సికింద్లాపూర్‌లో వైభవంగా బోనాలు



బోనాలతో భక్తులు



కొలువైన పోచమ్మ తల్లి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో గ్రామ దేవతాలకు ఆదివారం బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో కొలువైన బంగారమ్మ, దుర్గమ్మ, పోచమ్మ, మహంకాళి ఆలయాల 4వ వార్షికోత్సవం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశాడు. ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింలు, కుమార్, వెంకటేష్, బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి, మహేశ్, నరేశ్, మల్లేశ్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆరాధన మహోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఆశ్రమంలో కృష్ణానంద స్వామి ఆరాధన మహోత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహా రుద్రం, ఆశ్రమ ఆవరణలో వైద్యులతో ఫిజియోథెరపీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చివరి రోజు పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో దర్బార్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆశ్రమాన్ని సందర్శించి, పూజల్లో పాల్గొన్నారు.



మహా రుద్ర పూజలో పండితులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మెదక్‌జోన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. 1997–99 బ్యాచ్ విద్యార్థులతో పాటు కళాశాల మేనేజ్‌మెంట్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలనాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జనవరి నుంచి ప్రారంభమయ్యే కొండపోచమ్మ ఉత్సవాలను పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఆదేశించారు. మండలంలోని కొండపోచమ్మ ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతియేటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే కొండపోచమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ తలెత్తకుండా ప్రత్యేకంగా వాలంటీరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయాన్ని సందర్శించిన ఆర్‌జేసీ

భక్తుల సందడి..

ఆదివారం కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం అనంతరం భక్తులు కొండపోచమ్మ దర్శనానికి బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈఓ రవి కుమార్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరి, లక్ష్మణ్, చందు, తదితరులు పాల్గొన్నారు.